గుప్పెడు కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

# రాక్షసుడు

మంజువాణి పుట్టి పెరిగింది పెద్దాపురంలో. ఆమె వయసు ఇరవైయారు. తన పదహారో ఏట వ్యభిచార వృత్తిలోకి ప్రవేశించింది మంజువాణి. దాదాపు ఏడేళ్ళుగా ఆమె వృత్తి నిరాటంకంగా సాగిపోతోంది.

మంజువాణికి చాలాకాలంగా సినిమాల్లో నటించాలనే కోరిక వుంది. సినిమాలు విపరీతంగా చూసే ఆమెకి, ఫలానా తార రాజమండ్రిలో వ్యభిచార వృత్తి చేస్తూ మద్రాసు వెళ్ళి సినిమాలో చేరింది లేదా ఫలానా తార కొవ్వూరు నుంచి వెళ్ళి సినిమాల్లో చేరింది అని ఎవరయినా చెప్పినప్పుడల్లా తాను మద్రాసు వెళ్ళి సినిమాల్లో తార లమే అదృష్టాన్ని పరీక్షించుకోవాలని పిస్తుండేది.

అయితే మంజువాణి తల్లి ఆమెకు ప్రధాన ప్రతిబంధకం అయింది. మద్రాసు వెళ్ళడానికి ఆవిడ ఒప్పుకోలేదు. దాంతో ఆ కోరిక అలా మనసులో ఓ మూల వుండి పోయింది. తమ వృత్తిలోంచి చాలామంది వెళ్ళి సినిమా నటీమణులవడం ఆ తర్వాత కూడా శ్రద్ధగా గమనిస్తున్న మంజువాణికి త్వరలోనే మద్రాస్ వెళ్ళే అవకాశం లభించింది.

మంజువాణి తల్లి మరణించింది.

నెల తిరక్కుండానే ఆమె మద్రాస్‌కి వెళ్ళే రైలెక్కింది, గుండెనిండా కోటి కోరికలతో భవిష్యత్తు మీద బంగారు కలలతో. సినిమా నటులవుదామని మద్రాస్ వెళ్ళే ఆడపిల్లలకి ఎదురయ్యే సాధారణ సంఘటనలే ఆమెకీ తారసపడ్డాయి.

పెద్ద దర్శకులని చూడటానికి అనుమతి లభించలేదు. దగ్గరకి తీసుకెళ్ళి పరిచయం చేస్తామనే మధ్యవర్తులు, చిన్న దర్శకులు మంజువాణి శరీరాన్ని వాడుకోవడమే తప్ప ఆమె సినిమా నటి అయేందుకు ఎలాంటి సహాయం చేయలేక పోయారు.

జూనియర్ ఆర్టిస్ట్‌గా కొన్ని వేషాలు వచ్చాయి. కాని ఎంత ఆకలేసినా సింహం గడ్డి ముట్టదు. తనతో తెచ్చుకున్న డబ్బు అయిపోయింది. ఆఖరి రూపాయి కూడా అయిపోయాక రెండే దారులు మిగిలాయి. తిరిగి పెద్దాపురం వెళ్ళిపోవడం లేదా మద్రాస్‌లోనే సంపాదన సాగిస్తూ సినిమా అవకాశాల కోసం ప్రయత్నించడం. రాజమండ్రి నించి, కొవ్వూరు నించి వచ్చిన నటీమణులు మద్రాస్‌లో రెండున్నర సంవత్సరాలు నానా కష్టాలు పడ్డాకే సినిమా అవకాశాలు సంపాదించుకోగలిగారని మంజువాణికి స్నేహితురాలయిన ఓ అమ్మాయి చెప్పింది. మద్రాస్ వదిలి వెళ్ళొద్దని ఆమె సలహా ఇచ్చింది.

ఇంకా సినిమా హీరోయిన్ అవాలనే కోరిక తగ్గకపోవటంతో మంజువాణికి స్నేహితురాలి సలహా నచ్చింది. ఫలితంగా మద్రాస్‌లోనే తన వృత్తిని కొనసాగించింది.



అలా కాలం గడుస్తోంది.

ఓరోజు మంజువాణి దగ్గరికి ఓ విటుడు వచ్చాడు.

"రాత్రి కెంత?" అడిగాడు కొద్దిగా సిగ్గుపడుతూ. అతనికి ఇలాంటివి కొత్తనిపించింది మంజువాణికి అతని ప్రవర్తననిబట్టి.

"అయిదు వందలు."

"మై గాడ్!"

"యువర్ గాడ్డే. బేరం లేదు. అందులో ఇవాళ డిసెంబర్ ముప్పై ఒకటి."

కాస్సేపు ఆలోచించుకుని చెప్పాడతనే– "సరే అయితే. అయితే చిన్న విషయం."

"ఏమిటి?"

"హోటల్‌కి రావాలి."

"ఎక్కడికైనా సరే. మా ఇంట్లో కుదరదు లెటూ."

"ఇంకో చిన్న విషయం"

"అదేమిటి?"

"పూర్తిగా చీకటిగా వున్న గదిలో అయితేనే నాకు బావుంటుంది. లైటు వెయ్యాలనకూడదు."

"రాత్రంతా!"

"అవును. రాత్రంతా. బాత్‌రూంకి వెళ్ళాల్సొచ్చినా?"

"అభ్యంతరం లేదు. కాని బాత్‌రూంకి వెళ్ళాల్సొస్తే చీకట్లో ఎలా?" వింతగా చూస్తూ అడిగింది మంజువాణి.

"లైట్ వెలిగితే మాత్రం నాకు ఇబ్బంది. దానికో కథ వుంది. అదో సైకలాజికల్ ఫియర్"

మంజువాణి తన వృత్తిలో అనేకమంది వింత మగాళ్ళని చూసిందికాని ఇలాంటి తరహాని ఎప్పుడూ చూడలేదు.

"మీ ఇష్టం. మీ ఖర్చు. ఎలా అంటే అలానే."

"ఏడున్నరకల్లా అక్కడ వుండాలి...ఇంకో చిన్న విషయం..."

"ఈ సారేమిటి?" విసుగ్గా అడిగింది.

"మరేం లేదు. నాకు సహజంగా కోరిక ఎక్కువ. చీకట్లో అయితే ఇంకా. విసిగిపోయావని, అలిసిపోయావని అనకుండా ఒప్పుకోవాలి ఈ న్యూ ఇయర్ పార్టీ రోజున." బతిమాలుతున్నట్లుగా చెప్పాడు.

మంజువాణికి తెలుసు ఎంత బలమయిన కోరిక వున్న మగాళ్ళయినా ఓ రాత్రిలో అయిదు సార్లు మించే బలమయినవాడు కాదని.

"అలాగే. వీటన్నిటికీ ఒప్పుకున్నందుకు మరో వంద ఎక్కువ ఇవ్వాలి."

గాల్లోకి బాణం విసిరింది. అదృష్టవశాత్తు అది తగిలింది. ముందు ఒప్పుకోక పోయినా చివరికి సరే అన్నాడు.

వెలుతురులో ఆ గదిలోకి అడుగు పెట్టినా, పూర్తి చీకటిలో అతనే మంజువాణి దగ్గరకి చేరాడా రాత్రి. లేచి బాత్‌రూంలోకి చీకట్లోనే వెళ్ళి వచ్చాడు. మళ్ళీ మంజువాణిని దగ్గరకు తీసుకున్నాడు.

ఒకసారి.

రెండు సార్లు.

మూడుసార్లు.

అర్థరాత్రి దాటాక ఏడో...సారి కూడా అతనిలో మొదట్లో వున్న వుత్సాహం, శక్తి తగ్గనే లేదని గ్రహించింది. ప్రతిసారి విశృంఖలంగా తన పని తాను చేసుకుపోతున్నా 'ఇతను మనిషా రాక్షసుడా' అనుకుంది. అప్పటికే పూర్తిగా అలసి పోయింది మంజువాణి.

తొమ్మిదోసారి ఇక వుండబట్టలేక చెప్పింది.

"ఇదే ఆఖరుసారి. నిద్రపోవాలి."

అతను సమాధానం చెప్పలేదు. లేచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళి మళ్ళా మంజువాణి పక్కన చేరాడు.

"నో నాకింక ఓపిక లేదు." బలహీనంగా చెప్పింది.

కొన్ని క్షణాలు అతను కదలకుండా వుండిపోయాడు. తర్వాత మళ్ళా మంజువాణిని ఆక్రమించుకోసాగాడు.

"ఇది ఖచ్చితంగా ఆఖరిసారి" అలుపుగా చెప్పింది మంజువాణి.

అయిదు నిమిషాల తరువాత.

అతను మంచం దిగి వెళుతూ చెప్పాడు నెమ్మదిగా. "నేను చెప్పానని అతనితో చెప్పకు. నిన్ను తీసుకు వచ్చినతను ఈ గది గుమ్మం బయట నిలబడి, అతనిలా గడ్డం పెరగని మగాళ్ళని లోపలకు పంపడానికి టిక్కెట్లమ్ముతున్నాడు. ఒక టిక్కెట్ ఖరీదు రెండు వందల ఏభై రూపాయలు."